


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 90 | 16-06-2026 మంగళవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00




## మెట్రో విస్తరణకు మోకాలడ్డిన
# కిషన్ రెడ్డి

- హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి
- కెసిఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్న గంగాపురం
- ఎన్‌వోసి ఇప్పించడంలో కూడా విఫలం
- ఎల్ అండ్ టికి రుణ బదలాయింపును అడ్డుకున్న పెద్దమనిషి
- అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి
- మోడీ హామీల అమలుపై చెప్పండి...నేను రాజీనామాకు సిద్ధం
- మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు

వివరాలు 2లో..

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు.





## ఇరాన్‌తో కుదిరిన
# శాంతి ఒప్పందం

### ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్

### ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు

పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా–ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి.

2




## కేరళలో నిఫా
# వైరస్ కలకలం

దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్ లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు.

2

## తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్
# విత్ మిల్క్' పథకం

### రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం



తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు.

వార్త 2లో

## శ్రీశైలంలో కిషన్ రెడ్డి
# దంపతులు

**శ్రీశైలం,**

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం ఉదయం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. కిషన్ రెడ్డి దంపతులు శ్రీ స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేద ఆశీర్వచనాలు పలుకగా, ఈవో స్వామి వార్ల శేష వస్త్రాలు, ప్రసాదాలను బహూకరించారు.





## తెలంగాణలో
# మోగిన బడిగంటలు

వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ రోడ్లపైకి వచ్చాయి. స్కూల్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు.

2




2

## సింగరేణిని ప్రైవేట్ పరం
# చేసే కుట్రలు

- ఓపెన్ కాస్టలత విస్తరణతో సంస్థకు నష్టం
- సింగరేణి బకాయిలు 50వేల కోట్లు చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలసి పోరాటం
- బొగ్గుబాయిబాట కార్యక్రమంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత

సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

### ప్రమాదంలో 12 మంది దుర్మరణం

**వాషింగ్టన్,**

అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# మెట్రో విస్తరణకు మోకాలడ్డిన కిషన్ రెడ్డి

### హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి

### కెసిఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్న గంగాపురం

### ఎన్‌వోసి ఇప్పించడంలో కూడా విఫలం

### ఎల్ అండ్ టికి రుణ బదలాయంపును అడ్డుకున్న పెద్దమనిషి

### అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి

### మోడీ హామీల అమలుపై చెప్పండి...నేను రాజీనామాకు సిద్దం

### మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్‌వోసి అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి ఎన్‌వోసి ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు



కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదన్నారు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా అని ప్రశ్నించారు.కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసరగా, సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

## ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

### ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్

### ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

## కేరళలో నిఫా వైరస్ కలకలం

### కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ నిర్ధారణ

### మెడికల కాలేజీ ఐసియూలో చికిత్స

### వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

### కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు

తిరువనంతపురం, అక్షరకలం ప్రతినిధి

: దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్ లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెళిలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

## స్కూలు బస్సులను తనిఖీ చేసిన అధికారులు

హైదరాబాద్,

తెలంగాణలో పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో విద్యాసంస్థల బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇవాళ వెయ్యికిపైగా స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 150కిపైగా బస్సులపై కేసు నమోదు చేశారు. ఫిట్‌నెస్ లేని 35 విద్యాసంస్థల వాహనాలను సీజ్ చేశారు.

## తెలంగాణలో మోగిన బడిగంటలు

### రాష్ట్రవ్యాప్తంగా తెరుసుకున్న స్కూళ్లు

### మళ్లీ రెఓడ్డెక్కిన బస్సులు, ఆటోలు

### కొన్నిచోట్ల విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ రోడ్లపైకి వచ్చాయి. స్కూళ్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి. తెలంగాణలో పాఠశాలలు తెరచుకోవడంతో తల్లిదండ్రులు మళ్లీ బిజీ అయ్యారు. కొత్త పుస్తకాలు.. ఏకరూప దుస్తులతో బడులకు వెళ్లే చిన్నారులతో సందడి నెలకొంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్తగా అల్పాహారాన్ని అందించనున్నారు. తొలి రోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న బుధవారం, 19న శుక్రవారం ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

## సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

మంచిర్యాల అక్షరకలం ప్రతినిధి

సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే.. వెంటనే సింగరేణికి బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా.. కాసిపేట మైన్-1ను ఆమె సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసమే.. టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ.. కార్మిక రంగాన్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడానికి హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాడాను.

## తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం

### రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. వారంలో 6 రోజులు మంచి




బ్రేక్‌ఫాస్ట్ పాలు, రాగి జావాను అందిస్తున్నామని.. దాదాపు రూ.800 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.విద్యార్థులను ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ స్కూల్లో చదివితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయనే రోజులు రానున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు కావాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూల్ వద్దు అనే భావన ఉందన్నారు. దాన్ని తొలగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రూ.800 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.



# కోవిడ్-19 ముందస్తు అంచనా నమూనాలపై పరిశోధనకు పీహెచ్.డీ.

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి బందు ఉప్పలయ్య డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'కోవిడ్-19 వ్యాప్తి గతశీలత అంచనా: వివిధ దేశాలలో కేసుల సరళి, మరణాల కోసం హైబ్రిడ్ గణాంక-యంత్ర అభ్యాస (ఞ్ఫ్అర్ఉమ్ఝ్రీ-మీఋఎష్ట్రఅఅవ ూమఝ్తీఅఅఅస్త్ర) విధానాల'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణాంక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రొఫెసర్ రాధిక మామిడి ఈ సిద్ధాంత వ్యాసాన్ని మూల్యాంకనం చేసి, మౌఖిక పరీక్ష(వైవా వోస్)కు బాహ్య పరీక్షకురాలిగా వ్యవహరించినట్టు తెలిపారు. ఈ డాక్టరల్ పరిశోధన, పలు దేశాలలో కోవిడ్-19 కేసుల ధోరణులు, మరణాల అంచనాను మెరుగుపరచడానికి, గణాంక సాంకేతికతలను డీప్



లెర్నింగ్ పద్ధతులతో అనుసంధానించి అధునాతన ముందస్తు అంచనా నమూనాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్టు వివరించారు. ఈ అధ్యయనంలో, టగుచి పద్ధతిని ఉపయోగించి ఆప్టిమైజ్ చేసిన ూా=×పీూ, వాూ=, గాసియన్ ప్రాసెస్ విధానాలను లాంగ్ షార్ట్-టర్మ్ మెమరీ (ూఙవీ) నెట్ వర్కులతో కలిపి వినూత్న హైబ్రిడ్ నమూనాలను అభివృద్ధి చేసినట్టు తెలియజేశారు. భారతదేశం, అమెరికా, ఫ్రాన్స్ నుంచి సేకరించిన కోవిడ్-19 మరణాల డేటాను ఉపయోగించి చేసిన తులనాత్మక విశ్లేషణలో, టెంపోరల్ కన్వల్యూషనల్ నెట్ వర్క్ (ఁజచీ) మోడల్ అత్యధిక అంచనా కచ్చితత్వాన్ని సాధించిందని, సాంప్రదాయ గణాంక నమూనాల కంటే నిలకడగా మెరుగైన పనితీరును కనబరిచిందని వెల్లడైందని పేర్కొన్నారు. ఈ పరిశోధన అంటువ్యాధుల అంచనా కోసం ఒక పటిష్టమైన, సాధారణీకరించదగిన చట్రాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రజారోగ్యం, పర్యావరణ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం వంటి రంగాలలో దీనికి వినియోగించే అవకాశం ఉందన్నారు. ఎందుకంటే, ఈ రంగాలలో సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి కచ్చితమైన అంచనాలు చాలా అవసరమని తెలిపారు. డాక్టర్ ఉప్పలయ్య సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్,15)



ఇటీవల పోలీస్ స్టేషన్ నూతన ఎస్హెచ్ఓలుగా బాధ్యతలు స్వీకరించిన దామరగిద్ద ఎస్ఐ నరేష్ మరియు కోస్గి ఎస్ఐ పురుషోత్తం ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. అనంతరం నూతన బాధ్యతలు చేపట్టిన అధికారులకు అభినందనలు తెలియజేసి, తమ విధులను అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, నేరాలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి మర్యాదపూర్వకంగా స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలు, వృద్ధులు మరియు బలహీన వర్గాల భద్రతకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, చోరీలు, భూ వివాదాలు, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ పేర్కొన్నారు.

# ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజావాణికి 55 దరఖాస్తులు.

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులలో 32 శాతం పెండింగ్ లో ఉన్నాయని త్వరితగతిన వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐడిఓసి సమావేశపు మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం ప్రజావాణికి మొత్తం 55 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కి వచ్చిన ఫిర్యాదులను ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుందని సంబంధిత శాఖల అధికారులు సంబంధిత వెబ్ సైట్ నుంచి ఫిర్యాదులను తీసుకొని పరిష్కరించాల్సి ఉందన్నారు. సర్వే, రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్, మున్సిపల్, డిఆర్డిఏ, విద్యుత్ శాఖల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజావాణి ఆర్జీలు రావడం జరిగిందని, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.



పాఠశాలలు ప్రారంభమైనందున మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించి పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా కనీసం 20 శాతం ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల చిన్నారులందరూ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చేరేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయడం జరిగిందని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు హైదరాబాదు నుంచి వచ్చిన ప్రజావాణి సమన్వయకర్త సహదేవ్ పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రెవిన్యూ శాఖలో అత్యధికంగా ఆర్జీలు పెండింగ్ లో ఉన్నాయని, భూ సమస్యలను ఎలాంటి ఇబ్బందులు రాకుండా పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

# అయిల్ ఫామ్ సాగు విస్తరణ పెంచాలి

## అయిల్ ఫామ్ రైతులను ప్రోత్సాహించాలి

## అయిల్ ఫామ్ సాగు పై సమీక్ష నిర్వహించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

అక్షర కలం సిద్దిపేట జూన్ 15:



అయిల్ ఫామ్ సాగు ను మరింత ప్రోత్సాహించాలని, రైతు లకు అవగాహన కలిపించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు అన్నారు.. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో అయిల్ ఫెడ్, హార్టికల్చర్ అధికారులతో అయిల్ ఫామ్ సాగు పై సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతు సిద్దిపేట నియోజకవర్గం లోనే అయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ని ఏర్పాటు చేశామని అయిల్ ఫామ్ సాగు విస్తరణ పెంచాలి.. అయిల్ ఫామ్ రైతులను ప్రోత్సాహించాలని ఇప్పటి వరకు సిద్దిపేట నియోజకవర్గం లో 4వేల 800ఎకరాలు, 1600 మంది రైతులు సాగు చేసారని, ఈ సంవత్సరానికి సిద్దిపేట నియోజకవర్గం లో 2వేల ఎకరాల లక్ష్యం గా పని చేయాలన్నారు.. అందుకు రైతు లను నిత్యం అవగాహన కలిపించాలని చెప్పారు.. మెగా ప్లాంటేషన్ కు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.. అయిల్ ఫెడ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండటం లేదని నా ద్రుష్టి కి వచ్చిందని యాప్ తో లింక్ లేకుండా అయిల్ ఫామ్ రైతు లకు యూరియా అందించాలని చెప్పారు.. పంట దెబ్బ తినకుండా సమయానుకూలంగా నీరు, ఫర్టిలైజర్ అందించాలని... రైతు లకు ప్రతి 6నెలలకు ఒక సారి మెగ్నీషియం, బోరాన్, ప్రతి మూడు నెలలకోసారి పోటాష్, యూరియా, ఎస్ ఎస్ పి ఈ ఆరు రకాల మందులు రైతులు సమయం ప్రకారం వేసుకునేల అవగాహన కలిపించాలని చెప్పారు.. మొక్కల చుట్టూ గడ్డి పెరగ కుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.. కొత్తగా సాగు పెంచేల ప్రతి గ్రామం లో రైతులకు అవగాహన కలిపించాలని కొత్త రైతు లను ప్రోత్సాహించాలని చెప్పారు.. ఫీల్డ్ అధికారులు ఎప్పటికప్పుడు ఫీల్డ్ మీద ఉండి రైతులకు ఇబ్బందులు కాకుండా చూడాలన్నారు. రైతులకు సబ్సిడీ పై వచ్చే పనిముట్లు అందించాలని చెప్పారు.

# ప్రైవేటు బడుల్లో సమాచార నోటీసు బోర్డులు పెట్టాలని డిమాండ్ .. గుడికందుల రవి జిల్లా కార్యదర్శి

అక్షర కలం సిద్దిపేట జూన్ 15:



నూతన విద్యా సంవత్సరం (2026-27) ప్రారంభమైన నేపథ్యంలో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ వసూళ్లను అరికట్టాలని మరియు విద్యా చట్టాల ప్రకారం ప్రతి స్కూల్లో నోటీస్ బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు సిద్దిపేటలోనీ కలెక్టరేట్లో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమంలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా వందలాది ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను, జీవో నంబర్ 42ను పూర్తిగా ఉల్లంఘిస్తూ తల్లిదండ్రుల నుండి అక్రమంగా వేలాది రూపాయల ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యా చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో తల్లిదండ్రులకు కనిపించేలా స్పష్టంగా కనిపించేలా సమాచారం బోర్డులను ఏర్పాటు చేయాలని కానీ జిల్లాలో ఏ ఒక్క ప్రైవేట్,కార్పొరేట్ స్కూల్ కూడా ఈ నియమాన్ని పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా వ్యాపార చీకటి దందాను అరికట్టడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతి పత్రంలోని ప్రధాన డిమాండ్లుపైన సమాచార నోటిఫికేషన్ బోర్డులో తరగతుల వారికి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు మరియు ఆ పాఠశాలల్లో బోధిస్తున్నటువంటి ఉపాధ్యాయుల యొక్క పేర్లు వారి యొక్క అర్హతలు పెట్టాలి. ఆ పాఠశాలకుసంబంధించినటువంటి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, బిల్డింగ్ పర్మిషన్ మరియు ముఖ్యంగా విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ఉచితంగా 25% శాతం విద్యను పేద విద్యార్థులకు అందించాలి, కానీ వాటిని అందించడం లేదు. వాటికి సంబంధించిన అప్డేట్ కూడా ఆ నోటీసు బోర్డులో పెట్టాలి, ఆ స్కూల్లో అమలు చేస్తున్నారా లేదా అనేది వీటిని తప్పనిసరిగా ఆ సమాచారం బోర్డులో తప్పనిసరిగా ఏర్పాటుచేసే విధంగా తమరు ఉత్తర్వులు జారీ చేయాలని వినతి పత్రంలో కోరడం జరిగింది. వారం రోజుల లోపల ఈ నోటీస్ బోర్డులను గనుక ఏర్పాటు చేయకపోతే ఏదైనా పాఠశాలలు ఏర్పాటు చేయకపోతే అట్టి పాఠశాలలపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని అక్రమ వాసులకు పాల్పడే పాఠశాలను గుర్తించి వాటి గుర్తింపును కూడా రద్దు చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి జశ్వంత్ జిల్లా నాయకులు వినయ్,శర్మ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ల రద్దుకై ఉద్యమించాలి

## -ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి "శింగు నరసింహారావు"

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:




ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై దేశ వ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో శింగు నర్సింహారావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మిక వర్గం ఎనిమిది గంటల పని, కనీస వేతనాలు, సంఘ హక్కులను కోల్పోతున్నారన్నారు. నూతన లేబర్ కోడ్ల ఆధారంగా యాజమాన్యాలు కార్మికులపై పని భారం ఎనిమిది గంటల నుంచి 12 గంటలకు పెంచారని ఆయన తెలిపారు. సంఘ హక్కును, సమ్మె హక్కును నిరాకరించి, కనీస వేతనాలు, అదనపు పనికి అదనపు వేతనం చెల్లించడం లేదన్నారు. పెరుగుతున్న ధరలతో పెరగని వేతనాలతో కార్మికుల జీవితాలు దుర్భరమవుతున్నాయన్నారు. కార్మిక శాఖ అధికారుల తనిఖీలు, పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యాలు యథేచ్ఛగా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. కార్మికుల సంఖ్యను తగ్గించి పని భారాన్ని పెంచుతున్నారని తెలిపారు. దీనితో కార్మికులు తీవ్రమైన అలసట, అసమ్మతికి గురవుతున్నారన్నారు. దాని ఫలితంగానే ఇటీవల ఢిల్లీ పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లోని వేలాది మంది కార్మికులు ఆకస్మిక సమ్మెకు దిగారన్నారు. పాలకులు కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా -అక్రమంగా కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. ప్రభుత్వ బాధ్యతారహిత చర్యలను ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇటీవల హైదరాబాద్ కెమికల్ ఫ్యాక్టరీ, విశాఖ స్టీల్ ప్లాంట్లలో సంభవించిన ప్రమాదాలు, కార్మికుల మరణాలు నాలుగు లేబర్ కోడ్ల దుష్ఫలితం, ప్రైవేటీకరణ విధానం వల్లనే జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయమని కేంద్రానికి తెలియజేయాలని, శతాబ్దాల కాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ హక్కుల చట్టాలను పటిష్టంగా -అమలు చేయాలని కోరారు. డాక్టర్ ఆక్ట్రాయిడ్ ఫార్ములాకు అనుగుణంగా కనీస వేతనాలు ప్రకటించాలని శింగు నర్సింహారావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఉద్యాన పంటల ప్రత్యామ్నాయ పంట నిర్వహణ వ్యూహాలులపై బులెటిన్ విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

అక్షర కలం హైదరాబాద్

తెలంగాణలో ఎల్ నీ నో నేపథ్యంలో ఉద్యాన పంటల్లో ప్రత్యామ్నాయ పంట నిర్వహణ వ్యూహాలపై శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన బులెటిన్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మాత్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అసెంబ్లీ వ్యవహారాలు, ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు లతో కలిపి విడుదల చేశారు. పంటలపై ఎల్లినో ప్రభావం, నష్టాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు సలహాలు, సూచనలు అందించాలని అధికారులను, వర్సిటీ వైట్ ఛాన్సర్ డాక్టర్ దండ రాజి రెడ్డి ని ఆయన కోరారు. బులిటన్లో పొందుపరిచిన అంశాలు రైతులకు కచ్చితంగా చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు నష్టాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సందర్భంగా ఆయన కోరారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, జన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్లర్ డాక్టర్ దండ రాజి రెడ్డి, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ శ్రీ షేక్ యాస్మిన్ భాష పాల్గొన్నారు. ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయడం, పంట సీజన్ పరిస్థితులను పర్యవేక్షించడం, వ్యవసాయ సలహాలను సమయానికి రైతులకు చేరవేయడం అత్యవసరం అని ఉద్యాన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. డి. రాజి రెడ్డి అన్నారు. తెలంగాణ వ్యవసాయం మరియు ఉద్యాన పంటల విజయానికి ఋతుపవనాలు కీలక పాత్ర పోషిస్తుంది. సమయానికి ఋతుపవనాలు రావడం, సమానంగా వర్షపాతం పడటం, ముఖ్యంగా ఖరీఫ్ సీజన్లో అధిక దిగుబడులు సాధించడానికి అవసరం. 2026లో ఎల్ నినో ప్రభావం కారణంగా, భారత వాతావరణ శాఖ (×వీఐ) అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా వర్షపాతం దీర్ఘకాల సగటు (ూూూ)లో 90% మాత్రమే ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో వర్షపాతం సమానంగా ఉండదని అంచనా. 2026లో ఎల్ నినో ప్రభావం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం అసమానంగా, హెచ్చు తగ్గులు ఉండే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణ మధ్య జిల్లాలు సాధారణం లేదా ఎక్కువ వర్షపాతం పడే అవకాశం ఉంది, అయితే ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో రైతులు సాగు నష్టాలను తగ్గించుకోవడానికి, పంటల సాగు కొనసాగించడానికి ప్రత్యామ్నాయ పంట నిర్వహణ వ్యూహాలు అత్యవసరం ఒంటి అంశాలు ఈ బుల్ టెన్ లో పొందుపరిచినట్టు పై చాన్స్ లో తెలిపారు.


బుల్ టెన్ లో పొందుపరిచినా కొన్ని అంశాలు

వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల నిర్వహణలో కొన్ని ముఖ్యమైన చర్యలు అవసరం:

- 60--75 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైన తర్వాతే నేలలో విత్తనం చేయాలి.
- నీటి సంరక్షణ కోసం ఎత్తైన బెడ్లు, మల్చింగ్, పంట కుంటలు ఏర్పాటు చేయాలి.
- డ్రిప్ ఇరిగేషన్, ఫర్టిగేషన్ పద్ధతులు ఉపయోగించి నీటి వినియోగ సామర్థ్యం పెంచాలి.

పశువుల ఎరువు, వెర్మికంపోస్ట్, వేప చెక్కలు వంటి సేంద్రియ ఎరువులు వాడి నేల తేమ నిల్వ చేయాలి.

- సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా పురుగులు, శిలీంద్రాలను నియంత్రించాలి.
- సాధ్యమైన ప్రతి చోట ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించాలి. తెలంగాణ రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా స్వల్ప కాలిక రకాలు, నీటి ఎద్దడిని తట్టుకుని పంటలు ఎంచుకోవాలి. మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ ఎరువులు వాడి నేల తేమ నిల్వ చేయాలి. నీటి ఎద్దడిని, అధిక వేడిని తట్టుకునేందుకు పైపాటుగా పిచికారి చేయాలి. రైతులకు అవగాహన కార్యక్రమాలు, సలహాలు దించాలి. హార్టికల్చర్, ఇరిగేషన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగాల సమన్వయం అవసరం.




అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ఎల్‌నినో కార్యాచరణ ఏదీ ?

**ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది.**

సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం,




భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామయ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు

## విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిసారించాలి.

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



ప్రభుత్వ పాఠశాలలలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. హాజరు రిజిస్టర్ ను పరిశీలించి ఉపాధ్యాయుల వివరాలు అడిగారు. పాఠశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన కమిటీని విద్యార్థులతో ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయించాలన్నారు. తరగతి గదులతో పాటు పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారిస్తే పదవ తరగతిలో మంచి మార్కులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. గతేడాది టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకంటే ఈ విద్యా సంవత్సరంలో ప్రస్తుత విద్యార్థులు బాగా చదివి ఇంకా ఎక్కువ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. సెలవులను ఎలా సద్వినియోగం చేసుకున్నారని, సమ్మర్ స్పెషల్ తరగతులకు ఎంతమంది హాజరయ్యారని అడిగారు. విద్యార్థులకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేయడం జరిగిందని, త్వరలోనే ఏకరూప దుస్తులను కూడా ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# గద్వాలలో భారీ దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు: ఇద్దరు నిందితుల అరెస్ట్, నగదుతో పాటు 60 తులలా వెండి, 9 తులాల బంగారం స్వాధీనం

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



గద్వాల పట్టణంలో ఇటీవల జరిగిన ఒక భారీ దొంగతనం కేసును స్థానిక పోలీసులు అత్యంత ప్రతిభావంతంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ. 7,000 నగదుతో పాటు 60 తులాల వెండి, 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

జోరుగా తిరుగుతూ రెక్కీ.. ఆపై దొంగతనం

పోలీసుల వివరాల ప్రకారం నిందితుల్లో ఒకరైన మహబూబ్ వెల్డింగ్ పని చేస్తుండగా, మరొకరు మేస్త్రీగా పని చేసేవారు. వీరిద్దరికీ వచ్చే సంపాదన సరిపోకపోవడంతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు తెరలేపారు. ఈ క్రమంలో గద్వాల పట్టణంలోని భీమ్ నగర్ పరిసరాల్లో బైక్‌పై తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించారు. పథకం ప్రకారం జూన్ 10, 2026 ఉదయం సమయంలో ఒక తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును దొంగిలించారు. ఆ వస్తువులను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూస్తుండగా పోలీసులకు చిక్కారు.

నిందితుడి వివరాలు

ా1 మహబూబు వయస్సు 19 సంవత్సరాలు, వృత్తి వెల్డింగ్ పని, నివాసం చెనుగోనిపల్లి గ్రామం, గద్వాల మండలం.

స్వాధీనం చేసుకున్న సొత్తు

9 తులాల బంగారం పొడవైన గొలుసు, మంగళసూత్రం, జంట జుంకాలు, చెవి రింగులు, సైడ్ ఇయర్ రింగ్స్, చిన్న పిల్లల ఉంగరం, పెద్ద ఉంగరం, ముక్కు పుల్ల. 60 తులాల వెండి. రూ. 7,000 నగదు. దొంగతనానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ బైక్.

పోలీసుల చాకచక్యం -- ఎస్పీ అభినందనలు

జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీ కె. శ్రీనివాస రావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ మరియు గద్వాల డీఎస్పీ పర్యవేక్షణలో గద్వాల సిఐ శ్రీ శ్రీను, కళ్యాణ్ ఎస్సై ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సిసి కెమెరాల దృశ్యాలు, సాంకేతిక నైపుణ్యం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూన్ 15, 2026 ఈరోజు ఉదయం గద్వాల పట్టణ శివారులోని చెనుగోనిపల్లి వెళ్లే రహదారి వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం ఉదంతం వెలుగుచూసింది. కేసును కేవలం 5 రోజుల్లోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన గద్వాల సిఐ శ్రీను, కళ్యాణ్ ఎస్సై, మరియు పోలీస్ సిబ్బంది ఇంద్రయ్య, కిరణ్, రామకృష్ణ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మానవత్వం చాటుకున్న పాత్రికేయుడు

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్, నగదును యజమానికి అందజేత

**మహమ్మదాబాద్, జూన్ 15 (అక్షరకలం):**



నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఓ పాత్రికేయుడు మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన కురువ మల్లేష్ దేశాయిపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో తన సెల్‌ఫోన్‌తో పాటు రూ.500 నగదును పొరపాటున పోగొట్టుకున్నాడు. అక్కడే వాటిని గుర్తించిన జనంసాక్షి రిపోర్టర్ మల్కయ్య బాధ్యతాయుతంగా వ్యవహరించి వెంటనే స్థానిక పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీసులు బాధితుడి వివరాలను గుర్తించి, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌తో పాటు నగదును హెడ్ కానిస్టేబుల్ నారాయణ చేతుల మీదుగా యజమాని కురువ మల్లేష్‌కు అందజేశారు. తన విలువైన వస్తువులు తిరిగి లభించడంతో బాధితుడు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు, పాత్రికేయుడు మల్కయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీతో వ్యవహరించి పోగొట్టుకున్న వస్తువులను యజమానికి అప్పగించిన మల్కయ్యను స్థానికులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. సమాజంలో ఇంకా మానవత్వం, నిజాయితీ విలువలు సజీవంగా ఉన్నాయని ఈ ఘటన మరోసారి నిరూపించిందని పలువురు పేర్కొన్నారు.

# వృద్ధుల హక్కుల పరిరక్షణకు అవగాహన అవసరం

## ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన శిబిరం

**నవాబుపేట, జూన్ 15 (అక్షరకలం):**




ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ నిరోధక అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు డీఎల్ఎస్ఏ కార్యదర్శి డి. ఇందిరా అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నాల్సా) సూచనల మేరకు సీనియర్ సిటిజన్ల సంక్షేమ పథకాలు, వారికి చట్టపరంగా కల్పించిన హక్కులు, వృద్ధుల సంరక్షణ మరియు సంక్షేమ చట్టం--2007పై అవగాహన కల్పించారు. వృద్ధులపై జరుగుతున్న వేధింపులు, నిర్లక్ష్యం, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అందుబాటులో ఉన్న న్యాయ పరిరక్షణల గురించి వివరించారు. వృద్ధులను గౌరవించడం, వారి హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, అవసరమైన సందర్భాల్లో ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. “వృద్ధులను గౌరవిద్దాం -- వారి హక్కులను పరిరక్షిద్దాం” అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో నవాబుపేట మండల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షురాలు సరస్వతమ్మ, మాజీ జడ్పీటీసీ ఇందిరాదేవి, ఎస్ఐ నరేందర్, ఆర్ఐ గాయత్రీ, పారా లీగల్ వాలంటీర్లు వెంకటేశ్వరప్ప, నాగభూషణం, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నవాబుపేట లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను డీఎల్ఎస్ఏ కార్యదర్శి సందర్శించి, ఎంపీడీఓతో కలిసి పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కార చట్టం--2013 (పోష్ చట్టం)పై అవగాహన కల్పించారు. అలాగే భవిత సెంటర్‌ను కూడా సందర్శించి అక్కడి కార్యకలాపాలను పరిశీలించారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు

## ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం జరగాలి: ఎస్పీ డి. జానకి



మహబూబ్‌నగర్, జూన్ 15. అక్షర కలం : ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా విన్నారు. అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విచారణను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖను ఆశ్రయించే ప్రజల వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి పారదర్శకంగా విచారణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిశీలించి బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలందించడం ప్రతి పోలీసు అధికారికి బాధ్యత అని తెలిపారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# దండు సారయ్య జన్మదిన వేడుకల మధ్య ఘనంగా ముగిసిన రెండు రాష్ట్రాల స్థాయి డాన్స్ పోటీలు.

**అక్షర కలం / ఇల్లెందు**


ఇల్లందు పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య జన్మదిన వేడుకల మధ్య వెంకట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో, విబిసిసి సహకారంతో సోమవారం సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ--ఆంధ్ర రెండు రాష్ట్రాల స్థాయి డాన్స్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దండు సారయ్యను భారీ కేక్ కట్ చేయించి గజమాలతో సత్కరించారు. వందలాది మంది కళాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విజేతలకు దండు సారయ్య చేతుల మీదుగా నగదు బహుమతులు, షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. సీనియర్స్ గ్రూప్ విభాగంలో నాచురల్ నవీన్ టీమ్ (వరంగల్), ఎంజే అశోక్ టీమ్ (మణుగూరు) ప్రథమ బహుమతి, కళ్యాణ్ టీమ్ (భూపాలపల్లి) ద్వితీయ బహుమతి, గణేష్ టీమ్ (భూపాలపల్లి) తృతీయ బహుమతి సాధించగా, జూనియర్స్ గ్రూప్ విభాగంలో వనపర్తి టీమ్ ప్రథమ, ఎంజే అశోక్ టీమ్ (మణుగూరు) ద్వితీయ, ప్రసంగి టీమ్ (జమ్మికుంట), బిట్ బిట్ ప్రశాంత్ టీమ్ (గోదావరిఖని) తృతీయ బహుమతులు పొందాయి. సీనియర్ సోలో విభాగంలో అభి (విశాఖపట్నం) ప్రథమ, పరమేష్ కుమార్ (హైదరాబాద్) ద్వితీయ, లాస్య (జమ్మికుంట) తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా దండు సారయ్య మాట్లాడుతూ యువ కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కళలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.



కార్యక్రమంలో డాక్టర్ ఆకుల లక్ష్మి, పబ్బోలు స్వాతి కిరణ్, పింగళి అనన్య నరేష్, ఓంగూరి శ్రీనివాస్, దాసరి గోపాలకృష్ణ, రవి నాయక్, కడారి నటరాజ్ పాల్గొనగా, సర్వేశ్ మాస్టర్, రమేష్ మాస్టర్, ప్రభురాజు మాస్టర్, నవ్య మౌనిక మాస్టర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వెంకట్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు కడారి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయి మాస్టర్, శ్రీకాంత్ మాస్టర్, శేఖర్ మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.


అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట





# సూర్యకుమార్ యాదవ్‌పై వేటు..



పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత సెలెక్టర్లు వేటు వేసినట్లు తెలుస్తోంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 గెలిచినా అతన్ని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించేందుకు అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాదిగా సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దాంతోనే జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందని ఓ అధికారి మీడియాకు తెలిపారు. అప్‌కమింగ్ సిరీస్‌ల్లోనూ అతనికి చోటు దక్కే అవకాశం లేదని స్పష్టం చేశారు. 'సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని బీసీసీఐ నిర్ణయించింది. అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపడుతాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్తో జరిగే టీ20 సిరీస్‌ల్లో టీమిండియాను శ్రేయస్ అయ్యర్ నడిపిస్తాడు. గతంలో సూర్యకుమార్ యాదవ్ ఆడిన నాలుగో నంబర్ స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు దిగుతాడు. యువ బ్యాటర్ తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించనున్నారు. టీ20 ప్రపంచకప్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌ను ఈసారి పరిగణనలోకి తీసుకోలేదు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సంజు శాంసన్‌ను కెప్టెన్‌ను చేయాలని కోరాడు. కానీ అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ అందుకు అంగీకరించలేదు. సంజూ బ్యాటింగ్‌లో నిలకడ లేదని సాకుగా చూపారు. ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చినప్పటికీ.. సంజూను కెప్టెన్ చేసేందుకు అంగీకరించలేదు. చివరికి శ్రేయాస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా.. తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించడానికి అందరూ అంగీకరించారు.

# వైభవ్ వెనుక కార్పొరేట్ కంపెనీల పరుగులు

క్రికెట్ ప్రపంచంలో ప్రస్తుతం ఒకే ఒక్కడి పేరు మారుమోగిపోతోంది. అతడే 15 ఏళ్ల టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ బుడ్డోడు సృష్టించిన సునామీ అంతా ఇంతా కాదు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరఫున ఆడిన వైభవ్.. తన బ్యాటింగ్ విశ్వరూపంతో క్రికెట్ దిగ్గజాలనే ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ ముగింపు వేడుకల్లో మేజర్ అవార్డులన్నింటినీ ఇతడే క్లీన్ స్వీప్ చేశాడు. దాంతో రాత్రికి రాత్రే ఈ బిహార్ కుర్రాడి బ్రాండ్ వాల్యూ ఆకాశాన్ని తాకింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం పక్కకు నెట్టి కార్పొరేట్ కంపెనీలు ఈయన వెనుక పరుగులు పెడుతున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో రన్నరప్ రేసులో రాజస్థాన్ క్వాలిఫైయర్-2 లో ఓడిపోయినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ మాత్రం చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సాధించడంతో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్, సూపర్ సిక్సెస్ అవార్డులను కైవసం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చిన్న వయసులో ఈ అవార్డులు గెలవడమే కాకుండా.. ఒకే సీజన్‌లో ఎంవీపీ, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులు రెండూ సాధించిన ఏకైక ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ సైతం స్పందిస్తూ.. భవిష్యత్తులో బాలీవుడ్, హాలీవుడ్ స్టార్ల కంటే పెద్ద సెలబ్రిటీ వైభవ్ అవుతాడని జోస్యం చెప్పారు. ఐపీఎల్‌లో వైభవ్ చూపించిన ప్రతాపానికి బ్యాట్ స్పాన్సర్‌షిప్ మార్కెట్ అప్సెట్ అయిపోయింది. కోహ్లీ బ్యాట్ స్పాన్సర్ ఎమ్ఆర్ఎఫ్, రోహిత్ శర్మ బ్యాట్ స్పాన్సర్ సియట్ లాంటి దిగ్గజ క్రీడా సంస్థలు వైభవ్ బ్యాట్ రైట్స్ కోసం పోటీ పడుతున్నాయి. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఒక ప్రముఖ కంపెనీ అయితే ఈ 15 ఏళ్ల కుర్రాడికి ఏకంగా బ్లాంక్ చెక్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రేజ్ చూసి వైభవ్ తన కమర్షియల్ యాడ్స్ రేట్లను ఏకంగా రెట్టింపు చేసేశాడు. వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు.వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు.మే 30వ తేదీన జార్ఖండ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ఒక కీలక ప్రకటన చేశారు. వైభవ్‌ను యూత్ ఎనర్జీకి నిలువెత్తు రూపంగా అభివర్ణిస్తూ, త్వరలోనే జార్ఖండ్ ఆరోగ్య శాఖ తరుపున ప్రచారకర్తగా నియమించనున్నట్లు పేర్కొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా

CINEMA





# మాటే పాటయితే.. సింగీతం తరహా మూవీ

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం.

# జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృతిక్ ?

సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మినన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అంది స్తుం డగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# కిరణ్ అబ్బవరం కెఎ 13

## సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# జిల్లాలో 'వనమహోత్సవం' విజయవంతం చేయాలి

## కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపు

## ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

## పాఠశాలల్లో వసతులు, ఇందిరమ్మ ఇళ్లు, నకిలీ విత్తనాల నియంత్రణపై అధికారులకు కీలక ఆదేశాలు

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**



ఈనెల 18 న రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమం కింద పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్న దృష్ట్యా జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి పిర్యాదులను స్వీకరించారు. సోమవారం నుండి పాఠశాలలు పునః ప్రారంభమైనందున పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక అధికారులు పాఠశాలలపై సమీక్షించాలని, రాష్ట్రప్రభుత్వం పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠశాలలు, హాస్టళ్లలో అన్ని వసతులు కల్పించడం జరిగిందని, ముఖ్యంగా హాస్టల్లలో విద్యార్థులకు భోజనానికి సంబంధించిన టెండర్లు అన్నింటిని పూర్తి కాగానే వర్క్ఆర్డర్ ఇచ్చి అవసరమైన సామాగ్రి తెప్పించుకోవాలన్నారు. యూనిఫార్మ్ క్లాత్ రాగానే కొత్తవారికి కూడా కొలతలు తీసుకొని యూనిఫార్మ్ కుట్టించే ఏర్పాటు చేయాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న అన్ని శాఖలు పెద్ద ఎత్తున మొక్కలు నాతెందుకు చర్యలు తీసుకోవాలని, అంతేకాక సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టాలన్నారు. అటవీ శాఖ ద్వారా రెండు లక్షల 80వేల డిఆర్డిఓ, పంచాయతీరాజ్ ద్వారా 31 లక్ష, వ్యవసాయ, మున్సిపల్, రెవిన్యూ, తదితర శాఖల ద్వారా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు అన్ని శాఖలు నూరు శాతం లక్ష్యాలు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని అన్నారు. అలాగే వర్షాకాలం ప్రారంభమైనందున అన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ సంస్థల లో వాననీటి సంరక్షణ కట్టడాలను నిర్మించాలని తెలిపారు. గ్రామాలలో, పట్టణాలలో కుక్కకాటుకు ఇబ్బంది పడకుండా పారిశుధ్యం పై దృష్టి సారించాలని అన్నారు. గడిచిన రెండు నెలల నుండి ప్రజావాణి దరఖాస్తులు పెరుగుతున్నాయని, డివిజన్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేకుంటే చర్య తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లో భాగంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినందున మండలాలలో ఇల్లు లేని వారిని గుర్తించి వెంటనే జీవో ద్వారా నియమించిన గజిటెడ్ అధికారితో పరిశీలన చేయించాలని తెలిపారు. ఈ విషయంలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు చురుకుగా వ్యవహరించాలని చెప్పారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరిలో 10.10 వెరైటీ లేకుండా చూడాలని, అలాగే యూరియాకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. అంగన్వాడి ద్వారా ఫ్యాన్లు, లైట్ల పనులను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని చెప్పారు. కాగా సోమవారం నాటి జిల్లా స్థాయి ప్రజావాణి కి రెవిన్యూ శాఖకు 55, ఇతర శాఖలకు 80 ఫిర్యాదులు వచ్చాయి. ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్ఓ దశరథ నాయక్, డి ఎఫ్ఓ రాజశేఖర్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఇతర అధికారులు, ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

# చెరువుగట్టులో మహిళపై కత్తితో దాడి..

## కుండల విక్రయం వివాదం ప్రధాన కారణం

**అక్షర కలం : నకిరేకల్ నియోజకవర్గం**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చెరువుగట్టు దేవస్థానం వద్ద కుండల విక్రయం విషయంలో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, కత్తితో దాడి చేసేవరకు వెళ్ళింది. ఈ ఘటనపై నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి కులానికి చెందిన సుమారు 40 కుటుంబాలు చెరువుగట్టు దేవస్థానం వద్ద సంప్రదాయ పద్ధతిలో వంతుల వారీగా కుండలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఎల్లారెడ్డిగూడెంకు చెందిన బొడ్డుపల్లి జ్యోతి (27) తన వంతు ప్రకారం కుటుంబ సభ్యులతో కలిసి



చెరువుగట్టు వద్ద కుండలు విక్రయిస్తోంది. ఆ సమయంలో నల్లగొండకు చెందిన శేషరాజుల సునీత (37) కూడా అక్కడ కుండలు విక్రయించడాన్ని జ్యోతి గమనించి ప్రశ్నించింది. ?దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన శేషరాజుల సునీత దుర్భాషలాడుతూ, తన వద్ద ఉన్న కత్తితో బొడ్డుపల్లి జ్యోతిపై దాడికి తెగబడింది. ఈ దాడిలో జ్యోతి చేతికి లోతైన గాయమైంది. అక్కడ ఉన్న ఇతర మహిళలు అడ్డుకోబోగా, సునీత వారిపై కూడా కత్తితో దాడికి పాల్పడింది. ఈ క్రమంలో బొడ్డుపల్లి భవాని అనే మహిళకు రెండు చేతుల మణికట్టు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా బాధితుల చేతులను సునీత కొరికినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తు లో ?గతంలో కూడా శేషరాజుల సునీత, ఎల్లారెడ్డిగూడెంకు చెందిన బొడ్డుపల్లి శంకర్ అనే వ్యక్తి సహకారంతో పలుమార్లు ఇక్కడ గొడవలకు పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో వివరించింది. బాధితురాలైన బొడ్డుపల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్కట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో వెల్లడి కానున్నాయని ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

# ఘనంగా శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు



**అక్షరకలం బీబీనగర్**

బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జంపల్లి సర్పంచ్ ఏర్పుల మనోహర నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో బీబీనగర్ వయోవృద్ధుల సంక్షేమ సంఘం మరియు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి, వృద్ధులకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంజాల సదానంద గౌడ్, బీబీనగర్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉప్పలంచి శ్రీకాంత్, గొల్లకొండ శేఖర్, వి.మహేష్, పంజాల వేణు, కాసుల సాయి, బసవరాజు, ఉపేందర్, భరత్, రెడ్డబోయిన నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎం లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి-కలెక్టర్ చంద్రశేఖర్

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఎఫ్ ఎల్ ఎం లో జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని మర్రి గూడెం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫౌండేషన్ లిటరసీ సంఖ్యాశాస్త్ర సామర్థ్యాలు పెంచాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు అక్టోబర్, నవంబర్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థికి మాతృభాషతోపాటు, హిందీ, ఇంగ్లీష్ తప్పనిసరిగా చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలతో పాటు, పరిశుభ్రత, అలాగే పాఠశాల ఆవరణము శుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశు భ్రతను బోధించాలని, అలాగే జీవితం గురించి పిల్లలకు తెలియజేయాలని, వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగేందుకు తరగతులు ప్రారంభమయ్యే ముందు బోధించాలని చెప్పారు .ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని,



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కై అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, అందువల్ల పిల్లలు బాగా చదువుకోవాలని, చెప్పింది వినాలని అన్నారు. అలాగే పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, దాంతోపాటు, వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, సొంత స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని చెప్పారు. త్వరలోనే విద్యార్థులకు కొత్త యూనిఫామ్ రానుందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ అకాడమిక్ విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని అందించనుందని, కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు కూడా యూనిఫామ్ ఇచ్చేందుకు కొలతలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలని, ముఖ్యంగా 10 తర్వాత ఎట్టి పరిస్థితులలో పాఠశాల మానివేయవద్దని, ఉద్యోగం రావాలన్న లేదా వారి కాళ్లపై వారు నిలబడాలన్న పై చదువులు చదవాలని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి. సుశీందర్ రావు, కార్పొరేటర్లు శంకరయ్య ఉన్నారు.



# ప్రభుత్వ స్కూళ్ల కుదింపు నిర్ణయం తప్పు

## ప్రైవేట్ ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

## విద్యా, వైద్యం, నిరుద్యోగ సమస్యలపై సీపీఎం పోరాటం

## ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో యువజన సమ్మేళనం

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరనే నెపంతో 16 వేల పాఠశాల నుండి 4వేల పాఠశాలకు కుదించడానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తప్పుపట్టారు. సోమవారం నల్లగొండలోని జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు ఇబ్బడి ముబ్బడిగా పెంచుతుంటే చూస్తూ ఊరుకుంటుందని వాటిని నియంత్రించడానికి రాష్ట్ర శాసనసభల్లో ప్రవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. ఈరోజు నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే పాఠ్యపుస్తకాలు మరియు స్కూల్ డ్రెస్సులు వారికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం అన్ని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలని కోరారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ అన్ని ప్రభుత్వ వైద్యశాలలో అవసరమైన మందులతో పాటు తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నోటిఫికేషన్లను విడుదల చేయాలని చెప్పారు. గతంలో ఉన్న బారాస గాని, నేటి కాంగ్రెస్ గాని, 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రణాళిక బద్ధంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లను విడుదల చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో యువజన సమ్మేళనం హైదరాబాద్లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం నిర్వహించే ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాను ఎలాంటి భావ ద్వేషాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా చేపట్టాలని సిపిఎం కోరుతుందన్నారు. ఎన్నికల సంఘం సర్ పేరుతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అర్హులైన ఓటర్లను కూడా తొలగించారని గుర్తు చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా వ్యవహరిస్తుందని తెలిపారు. తెలంగాణలో నిర్వహించే సర్ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రామ మున్సిపల్ కేంద్రాల్లో అన్ని పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటర్ల జాబితాను తయారు చేయాలని కోరారు. జూన్, జూలై, ఆగస్టు మాసాలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యా, వైద్యం, నిరుద్యోగం, రేషన్ షాపుల్లో 14 రకాల వస్తువులను సరఫరా చేయాలని మరియు స్థానిక సమస్యలపై సర్వేలు ఆందోళన పోరాటాలు నిర్వహించాలని సిపిఎం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనది కాబట్టి అన్ని రకాల ఎరువులు విత్తనాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో సగం విడుదల చేసిన రైతు భరోసా తో పాటు ఖరీఫ్ రైతు భరోసానిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా అమ్మకం యాప్ ను రద్దు చేయాలని కోరారు. అన్ని షాపుల్లో అన్ని వ్యవసాయ పరపతి సంఘాలలో యూరియా డిఏపి రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. లేనియెడల రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశం, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలు.!

## -- 29 గుంటల భూమి కోసం బాధితురాలి పోరాటం

## ---నా సమాచారం తప్పైతే నాపై చర్యలు తీసుకోండి

## --ఆర్డీఓ ఎదుట బాధితురాలి ఆవేదన

**అక్షరకలం నల్గొండ**

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందంపల్లి (గొల్లగూడెం) గ్రామానికి చెందిన చిర్రబోయిన రమణమ్మ అనే మహిళ తన వ్యవసాయ భూమి పట్టాదారు పాస్ బుక్ సమస్యపై జిల్లా ఆర్డీఓ కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. తాను 1992లో సర్వే నెంబర్ 173 పరిధిలో కొనుగోలు చేసిన భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

? 1992లో రిజిస్ట్రేషన్ ( డిఓసి నెంబర్ 1030/92, 1163/92) ద్వారా కొనుగోలు చేసిన భూమి, వారసత్వ భూమి అంతా కలిపి రికార్డుల్లో సక్రమంగా ఎక్కించలేదు. సర్వే నెంబర్ 173లో తమకు ఎలాంటి ఎస్ఎల్బీసీ కాలువ భూసేకరణ జరగకపోయినప్పటికీ, 2015 ఆన్లైన్ చేసే సమయంలో 10 గుంటల భూమి కాలువలో పోయిందంటూ రికార్డుల నుండి తొలగించారని బాధితురాలు పేర్కొన్నారు. తమకు కేవలం సర్వే నెంబర్ 213, 214 లలో మాత్రమే 1999లో కాలువ పోయిందని స్పష్టం చేశారు.

తాను కొనుగోలు చేసిన భూమిలో మరికొంత భాగం (0-19 గుంటలు) తన పేరు మీద ఎక్కించకుండా, పాత యజమానుల పేరు మీదే కొనసాగిస్తూ వచ్చారని ఫిర్యాదులో వివరించారు. తనకు రావాల్సిన మొత్తం 29 గుంటల భూమిని సర్వే నిర్వహించి, పట్టాదారు పాస్ బుక్ లో ఎక్కించాలని కోరారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని, 1993 నుండి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఒకవేళ తాము ఇచ్చిన సమాచారం తప్పని తేలితే తమపై కూడా చర్యలు తీసుకోవచ్చని ఆర్డీఓకు సమర్పించిన అర్జీలో పేర్కొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన చదువు

## త్వరలోనే ఉదయం అల్పాహారం

### పాఠశాలల పునః ప్రారంభం వేళ కోమటిరెడ్డి ప్రతీక్ పాఠశాలను సందర్శించిన నల్గొండ కలెక్టర్

### మూతపడ్డ ప్రాథమిక పాఠశాలలను కూడా తెరిపిస్తామని కలెక్టర్ వెల్లడి

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం





విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం బొట్టుగూడలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతులను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు ప్రారంభమైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించాలన్న ముఖ్య ఉద్దేశంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతోపాటు, ఉదయం అల్పాహారం కూడా అందించనున్నానని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థులకు త్వరలోనే నూతన యూనిఫామ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలో మూతపడ్డ కొన్ని ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించాల్సిందిగా సర్పంచులు అడుగుతున్నారని, వాటిని కూడా ప్రారంభిస్తామని, పాఠశాలలు, హాస్టల్లో చిన్న చిన్న మరమ్మతులను చేపట్టి అన్నింటిని విద్యార్థులకు సౌకర్యంగా తీర్చిదిద్దినట్లు ఆయన వెల్లడించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, పాఠశాల యాజమాన్యం, స్థానిక కార్పొరేటర్ తదితరులు ఉన్నారు.

# లైన్‌మెన్ నిర్లక్ష్యానికి యువకుడు తీవ్ర గాయాలు

### --న్యాయం చేయాలంటూ చిట్యాల సబ్ స్టేషన్ ఎదుట విద్యుత్ సరఫరా నిలిపివేసి ధర్నా



అక్షరకలం చిట్యాల

కరెంట్ పనుల నిమిత్తం తీసుకెళ్లిన లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు విద్యుత్ ఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగి 18 రోజులు గడుస్తున్నా అటు లైన్‌మెన్ గానీ, ఇటు విద్యుత్ శాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో బాధితుడి కుటుంబం రోడ్డున పడింది. సోమవారం రోజు చిట్యాల లోని సబ్ స్టేషన్ లో పట్టిమర్తి గ్రామస్తులు విద్యుత్ సరఫరా నిలిపివేసి ధర్నాకు దిగారు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలైన తల్లి తెలిపిన వివరాల ప్రకారం. ?నల్గొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన తన కొడుకు మనోజ్ మే 30, 2026 నాడు స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో పని చేసే లైన్‌మెన్ వెంకటేష్ కరెంట్ పని కోసం పిలుచుకెళ్లాడు. ?పని చేసే సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా, కరెంట్ లైన్ 11 కె.వి పోల్‌పైకి మనోజ్ ను ఎక్కించారు. లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో (ఇండక్షన్ రావడం వల్ల) మనోజ్ కు తీవ్రంగా కరెంట్ షాక్ కొట్టి పైనుంచి కిందపడిపోయాడు అని తెలిపారు ?ఈ ప్రమాదంలో మనోజ్ కు రెండు కాళ్లు, చేతులు, వీపు భాగం తీవ్రంగా గాయాలు తాకి విరిగిపోయాయి. పరిస్థితి విషమించడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు అన్నారు. భర్త లేని ఆ కుటుంబానికి కొడుకే (మనోజ్) ఆధారం కాగా, ఇప్పుడు కొడుకు కూడా వికలాంగుడిగా మారడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరవుతోంది. ?ప్రమాదం జరిగిన సమయంలో లైన్‌మెన్ వెంకటేష్ బాధితుడి కుటుంబంతో మాట్లాడి, తానే చూసుకుంటానని నమ్మబలికాడు. కానీ ఆసుపత్రి లో 17 రోజులుగా చికిత్స పొందుతున్నప్పటికీ లైన్‌మెన్ గానీ, ఇటు విద్యుత్ శాఖ డిపార్ట్‌మెంట్ వారు గానీ కనీసం పట్టించుకోలేదు సరే కదా, కనీస సహాయం కూడా చేయలేదని బాధిత కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. దీనిపై బాధితుడి తల్లి జాల బద్రమ్మ తమకు జరిగిన అన్యాయాన్ని ప్రమాదానికి కారణమైన లైన్‌మెన్‌పై చర్యలు తీసుకుని, విద్యుత్ శాఖ నుండి తమ కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆమె వేడుకుంటున్నారు.

# బడి ప్రారంభోత్సవంలో ఘోర ప్రమాదం

### తోరణాలు కడుతూ విద్యార్థికి విద్యుత్ షాక్

### ఉపాధ్యాయుల నిర్లక్ష్యానికి ఎనిమిదో తరగతి విద్యార్థి బలి.!

### దేవరకొండ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామ్ చరణ్

అక్షరకలం దేవరకొండ



పాఠశాలల పునఃప్రారంభం వేళ కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బడి ముస్తాబులో భాగంగా స్కూల్ గేటుకు తోరణాలు కడుతుండగా ఒక్కసారిగా విద్యుత్ ఘాతానికి (కరెంట్ షాక్) గురై, రామ్ చరణ్ (13) అనే విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందంటూ స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

#### అసలేం జరిగిందంటే..

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు తెరుచుకోవడంతో కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌ను తోరణాలతో అలంకరించే పని చేపట్టారు. పాఠశాల పక్కనే నివాసముండే రామ్ చరణ్ అనే బాలుడు అక్కడ ఆడుకోవడానికి వచ్చాడు. బాలుడు కనిపించడంతో స్కూల్ గేటుకు తోరణాలు కట్టే పనిని ఉపాధ్యాయులు ఆ విద్యార్థికి అప్పగించారు. గేటుపై నిలబడి తోరణాలు కడుతున్న క్రమంలో, పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి రామ్ చరణ్ తీవ్రమైన కరెంట్ షాక్‌కు గురయ్యాడు. విద్యుత్ ఘాతంతో బాలుడు ఒక్కసారిగా కిందపడిపోవడంతో గమనించిన ఉపాధ్యాయులు వెంటనే స్పందించారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం దేవరకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

#### -ప్రైవేట్ స్కూల్ విద్యార్థితో పనులు...

ప్రమాదానికి గురైన రామ్ చరణ్ కొండమల్లెపల్లిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అసలు తమ స్కూల్ విద్యార్థి కాకపోయినా, ఆడుకోవడానికి వచ్చిన చిన్నారిని ఉపాధ్యాయులు అలంకరణ పనులకు పురమాయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలుడి కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు బీరువాల పంపిణీ



అక్షరకలం బిబినగర్

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల అవసరాల నిమిత్తం అర్వపల్లి శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీరువాలను అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు అర్వపల్లి శంకరయ్య దంపతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సురేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి సత్తి రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ గూడూరు మహిపాల్ రెడ్డి, సర్పంచ్ గోపి నాయక్, రామసాని నివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బడి తెరిచారు... భద్రత ముఖ్యం

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

### విద్యుత్ వైరింగ్, శానిటేషన్, తాగునీటిపై ప్రత్యేక నిఘా

### విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదు

### అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



నల్గొండ జిల్లాలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ కోరారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఛాంబర్ నుంచి నిర్వహించిన జూమ్ సమావేశంలో విద్యా విద్యుత్, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్, మైనారిటీ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులుతో మాట్లాడారు. జిల్లాలో విద్యా సంవత్సరం ప్రారంభమైనందున ప్రతి పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, బల్బులు, ఎర్తింగ్ వ్యవస్థ, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ గదులు, తాగునీటి సదుపాయాలను పూర్తిగా తనిఖీ చేయాలని సూచించారు. గోడలు తడిగా ఉన్న చోట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు పాఠశాలలను సందర్శించి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందజేయాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, శానిటేషన్ చేయాలని పేర్కొన్నారు. హాస్టళ్లలో వార్డెన్లు, వంట సిబ్బంది, ఆయాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేలా పర్యవేక్షించాలని, వంటశాలలు, కిచెన్లు, స్టోర్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. గ్యాస్ పైపులు, వంట సామగ్రిని తరచుగా తనిఖీ చేయాలని సూచించారు. పాఠశాలల పరిసరాల్లో కిరాణం షాపుల్లో మత్తు పదార్థాల విక్రయాలు, పాన్ షాపులు గుట్కాలు అనుచిత కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎవరైనా మధ్యలో చదువు మానేస్తే వారి వివరాలను గుర్తించి ప్రత్యేక జాబితాలు రూపొందించాలని, తల్లిదండ్రులకు ఉన్నత విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో చదవడం, రాయడం నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలవుతున్నదో లేదో పర్యవేక్షించాలని, పీఎంశ్రీ పాఠశాలల్లో మిగిలిన మౌలిక సదుపాయాల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా అన్ని పాఠశాలలు, హాస్టళ్లకు తాగునీరు అందేలా చూడాలని, గ్రామపంచాయతీలు నీటి నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. హాస్టళ్లలో, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చేపట్టాలని, ప్రహరీ గోడల నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.
విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రమాణాల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు తరచూ పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని, అవసరమైతే హాస్టళ్లలో రాత్రి బస చేసి సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో ట్రైనీ ఐఏఎస్ శ్రీకాంత్ రెడ్డి, విద్యుత్, విద్య, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో తప్పులకు తావివ్వద్దు

### జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ ఆదేశం

అక్షరకలం నల్గొండ

ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై నియోజకవర్గ స్థాయిలో బిఎల్ఎ లకు పకడ్బందీ శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం ఆయన ఉదయాదిత్య భవన్ లో ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై ఈఆర్వోలు, ఎన్నికల విభాగం డిప్యూటీ తాహసిల్దారులు, బిఎల్ఓ సూపర్వైజర్లను ఉద్దేశించి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ తీసుకున్న సూపర్వైజర్లు కింది స్థాయిలో అదే రకమైన శిక్షణను ఇవ్వాలని, ఎలాంటి సందేహాలకు తావు లేకుండా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. బి ఎల్ ఈ లకు బిఎల్ఓ సూపర్వైజర్లు శిక్షణ ఇవ్వాలని, ప్రత్యేకించి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కింద రూపొందించిన ముసాయిదా జాబితా ప్రదర్శనలో ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకొని ప్రదర్శించాలని, ఒక చోట నుండి మరోచోటికి చిరునామా మారిన ఓటర్లు, ఆబ్సెంట్ ఓటర్లు అన్నిటిని జాగ్రత్తగా పరిశీలించుకోవాలని చెప్పారు. బి ఎల్ వో సూపర్వైజర్లు ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా ఓటరు జాబితా సమగ్ర సవరణను పూర్తి చేయాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్ బాలు, తదితరులు శిక్షణ ఇచ్చారు.



# జూన్ 16 నుంచి టెట్ పరీక్షలు

### --- పకడ్బందీ ఏర్పాట్లకు డిఆర్ఓ ఆదేశం

అక్షరకలం నల్గొండ

జిల్లాలో టెట్ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి దశరథనాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యా, పోలీస్, విద్యుత్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. టెట్ పరీక్షలు జూన్ 16 నుండి 22 వరకు జరగనున్నాయి.? జిల్లాలోని 'ఎస్పీఆర్ స్కూల్' లో మాత్రమే కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 1,304 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు (అభ్యర్థులు 8:30 లోపే కేంద్రానికి చేరుకోవాలి). రెండో సెషన్.. మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 4:30 వరకు (అభ్యర్థులు 1:30 లోపే హాజరు కావాలి). ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష ( సి బి టి ). అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలి. సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ (బ్యాకప్ జనరేటర్), ఆర్టీసీ బస్సుల సౌకర్యం, మరియు అత్యవసర వైద్య సేవల కోసం హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని డీఆర్ఓ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర రావు, డీఐ సూపరింటెండెంట్ స్వర్ణలత, చీఫ్ సూపరింటెండెంట్ నీలం రెడ్డి, రాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్తో రైతు మృతి.....



మెదక్ /కొల్చారం జూన్15(అక్షర కలం):-

మెదక్ జిల్లాలో విషాదం చోట చేసుకుంది. కరెంట్ షాక్తో ఓ రైతు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన రైతు కురుమ పోచయ్య (50) సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో కరెంట్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం ఉదయం తుకానికి నీళ్లు పెట్టడానికి పొలం వద్దకు వెళ్లగా తుకం మడి పక్కన ఉన్న సర్వీస్ వైరు తగలడంతో షాక్ కు గురై మరణించాడు. పోచయ్య మరణంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# రాష్ట్ర స్థాయి 12వ తెలంగాణ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో మెరిసిన మెదక్ జిల్లా క్రీడాకారులు.....

- క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్......



మెదక్ /కొల్చారం జూన్ 15(అక్షర కలం):-

ఈనెల 11,12 తేదీలలో హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం లో జరిగిన రాష్ట్రస్థాయి 12 వ తెలంగాణ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్ పోటీలలో మెదక్ జిల్లా నుండి పాల్గొని వివిధ క్రీడాంశాలలో పథకాలు సాధించిన మెదక్ జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ క్రీడాకారులు సాధించిన పథకాలను వారి మెడలో వేసి అభినందించారు. అథ్లెటిక్స్ క్రీడలలో పథకాలు సాధించిన అనిత 10 కిలోమీటర్ల పరుగు లో తృతీయ స్థానం, శేఖర్ 3000 మీటర్ల పరుగు లో ద్వితీయ స్థానం మరియు 400 మీటర్ల హార్డిల్స్ విభాగంలో ద్వితీయ స్థానం, అశోక్ మరియు రవి 4ఐ400 రిలే లో ద్వితీయ స్థానం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలలో జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రమేష్ గంగాల, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనుముల మధుసూదన్, కోచ్ అర్జున్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం....- జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్......

మెదక్ /కొల్చారం జూన్ 15(అక్షర కలం):-

సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిద ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యలు పరుష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వచ్చే సోమవారం వరకు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్లో నమోదు చేయాలని



సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తులు అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వనాలు.. పర్యావరణ పరిరక్షణకు వరాలు....

## - మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....



మెదక్/ కొల్చారం జూన్ 15(అక్షర కలం):-

వనాలు పర్యావరణ పరిరక్షణకు వరాలు అని మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకొని ఈనెల 18వ తారీఖు నుండి వన మహోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలనిరామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో నగర్ వన్ యోజన పార్కులో ఈనెల 18న వన మహోత్సవ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఆస్తి పన్ను వసూలలో కలెక్టరేట్ కార్యాలయ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్అధికారులను ఆదేశించారు .సోమవారం ప్రజావాణి అనంతరం వివిధ శాఖల అధికారులతో వనమహోత్సవ కార్యక్రమం, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఆస్తి పన్ను వసూలు , ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత సంబంధిత విషయాల పై అదనపు కలెక్టర్ నగేష్ , డీఎఫ్ఓ జో.జి డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులందరూ తమ భాగస్వామ్యం ద్వారా విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి, పచ్చదనాన్ని పెంపొందించడానికి వన మహోత్సవం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఈనెల 18 నుండి వన మహోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వక్చువల్ గా ప్రారంభిస్తున్న నేపథ్యంలో మన జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామన్నారు. అటవీ శాఖ,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మున్సిపల్ శాఖ, వివిధ సంక్షేమ శాఖలు వ్యవసాయ, విద్యా, తదితర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 31.95 లక్షల మొక్కలను నాటేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని పరిరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాను మరింత పచ్చదనంతో నింపేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ శాఖల వారీగా రివ్యూ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆస్తి పన్ను వసూలలో భాగంగా కలెక్టరేట్ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత డిఆర్ఓ ను ఆదేశించారు. కలెక్టరేట్ లోని వివిధ విభాగాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలని కార్యాలయాలు కలెక్టర్ ఆకస్మిక పర్యటనలలో అపరిశుభ్రంగా ఉన్న కార్యాలయాల అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ : తుంబూరు దయాకర్ రెడ్డి

- మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో 46 మందికి అందజేత



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

ఖమ్మం : "అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి మధ్యవర్తులు లేకుండా, వంద శాతం పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.16,64,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ నిధులు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు రూపాయి కూడా పక్కదారి పట్టకుండా, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేస్తూ నేరుగా లబ్ధిదారుల చేతులకే ఈ ఆర్థిక సాయం అందేలా చూస్తున్నామని వివరించారు. కార్పొరేట్ వైద్య భారాన్ని మోయలేక సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఈ సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# విజయలక్ష్మి నగర్ జిపి సమస్యలపై ఐటీడీఏ పివోకు వినతిపత్రం అందించిన సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు.



అక్షర కలం / ఇల్లందు.

మండలంలోని విజయలక్ష్మి నగర్ గ్రామ పంచాయితీ లో సీసీ రోడ్డు నిర్మాణం, క్వార్టర్స్ ఏరియాలో గృహలక్ష్మి పథకం వర్తింపు,స్కూలు బిల్డింగ్,చుట్టూ ప్రహరీ గోడ అంగన్వాడి బిల్డింగ్, మంజూరు, గ్రామపంచాయతీ బిల్డింగ్ తొ పాటు చుట్టూ ప్రహరీ గోడ పనులు కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని కోరుతూ పలు సమస్యలపై విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. 2022 లో నూతనంగా ఏర్పాటు ఐన గ్రామపంచాయతీకి ఐటిఐ నిధుల ద్వారా మంజూరైన పంచాయతీ బిల్డింగ్ ఇప్పటివరకు నిర్మాణం పూర్తి కాలేదని, యుద్ధ ప్రాతిపదిక మీద గ్రామపంచాయతీ కార్యాలయం తొ పాటు ప్రహరీ గోడను మంజూరు చేసి పూర్తిచేయాలని, జీపి సమస్యల సాధనకు నిదులు మంజూరు చేయాలని ఐటిడిఏ పివోకు సైతం వినతిపత్రం అందించారు. అద్దె భవనంలో గ్రామపంచాయతీ కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందని దీంతో పాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం పాలక వర్గ సమావేశం కూడా నిర్వహించుకోవాలంటే సరియైన సదుపాయాలు లేవని ఎండాకాలంలో రేకుల షెడ్డు కింద కూర్చోలేక చెట్ల కింద కూర్చుని పరిపాలన నిర్వహించడం జరుగుతుందన్నారు. వర్షాకాలంలో మరింత ఇబ్బందులకు గురవుతామని ఈ పరిస్థితి పై వెంటనే సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు తగిన ఆదేశాలు ఇచ్చి బిల్డింగ్ పనులు పూరైటట్లు చూడాలని, పెండింగ్లో ఉన్న నిధులు విడుదల చేయాలని కోరడం జరిగిందని తెలిపారు.

# ఘనంగా మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలు..

## -బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం..

## -తలసేమియా చిన్నారుల కొరకు..

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని ఖమ్మం జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మధర్ తెరిస్సా ఆశ్రమంలో మానసిక వికలాంగులకు అల్పాహారం, ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నేతలు మాట్లాడుతూ... సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి కొత్త జీవితం అందించవచ్చని పేర్కొన్నారు. యువత సేవా భావంతో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు, అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన



లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాల్లా ముందుకు తీసుకెళ్తున్నామని భట్టి విక్రమార్క అధ్వర్యంలో పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను



సమర్థవంతంగా అమలు చేస్తున్న భట్టి విక్రమార్క నాయకత్వం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించడం తమకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో అనేక మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమం అనంతరం భట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955